ప్రజాశక్తి

శుక్రవారం 3 ఫిబ్రవరి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





లిక్కర్ స్కాం

ఛార్జిషీట్‌లో 'మాగుంట' పేరు..

- జిల్లా రాజకీయాల్లో చర్చ..
- బిజెపి రాజకీయ వ్యూహమా?

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

లిక్కర్ స్కాం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈడీ రెండో ఛార్జిషీట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేరును చేర్చారు. ఈ వ్యవహారంపై ఇప్పుడు వాడివేడిగా చర్చ సాగుతోంది. రాజకీయవర్గాల్లో ఉత్కంఠ చర్చకు దారితీసింది. ఇదంతా కేంద్రంలో పాలన సాగిస్తున్న బిజెపి రాజకీయక్రీడగా భావిస్తున్నారు. ఢిల్లీ కేంద్రంగా జరిగిన లిక్కర్ స్కాంలో ఆంధ్రా, తెలంగాణ ముఖ్యనేతలుగా ఉన్న వ్యాపారులపై కేంద్రం నిఘా పెట్టింది. పలువురు ప్రముఖుల పాత్రపై గతంలోనే ఈడీ అధికారులు విచారణ జరిపారు. జిల్లాకు చెందిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేరు కూడా ఉన్న సంగతి తెలిసిందే. లిక్కర్ లైసెన్సులు దక్కించుకునే విషయంలో భారీగా ముడుపుల వ్యవహారం నడిచిందనేది ప్రధాన ఆరోపణ.



ఈ విషయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు ఆయన తనయుడు రాఘవరెడ్డి పేర్లు కూడా ప్రస్తావనకు వచ్చాయి. దీనిపై మాగుంట స్పందిస్తూ తమ కుటుంబం ఎప్పటి నుంచో లిక్కర్ వ్యాపారం నాయబద్ధంగా చేస్తోందన్నారు. ఈ వ్యాపారంలో అక్రమాలకు పాల్పడాల్సిన అవసరం తమ కుటుంబానికి లేదన్నారు. కావాలనే తమపై కొందరు దుష్ప్రచారం సాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పుడు రెండో ఛార్జిషీటులో ఎంపీ మాగుంట పేరు ప్రస్తావించారు. అందుకు దారితీసిన వ్యవహారాలు కూడా ఛార్జిషీటులో పేర్కొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

చంద్రబాబు పాలనలో అంతా మోసమే..

▶ 8లో

కూలీలకు భద్రతేదీ?

- పొలం పనులకు ప్రైవేటు వాహనాల్లో కిక్కిరిసి ప్రయాణం
- ప్రధాన రహదారుల్లో ప్రమాదాలకు గురవుతున్న వైనం
- ప్రత్యామ్నాయాలు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు



అద్దంకి వద్ద బుధవారం మినీ లారీ బోల్తా పడటంతో గాయాలపాలైన కూలీలు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

- ఇటీవల ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పంగులూరు మండలం, జాగర్లమూడివారిపాలెం సమీపంలో జాతీయరహదారిపై కూలీలతో వెళుతున్న ఆటో బోల్తా పడి ఇద్దరు మృతిచెందారు. 22 మందికి గాయాలయ్యాయి.

- త్రిపురాంతకం మండలంలో గుంటూరు-కర్నూలు రహదారిపై రెండు ఆటోలు ఢీ కొన్న ఘటనలో ఒకరు చనిపోయారు. నలుగురికి గాయాలయ్యాయి.

ఇదే మండలం దూపాడు వద్ద ఆటో డోరు ఊడిపోయి ఒక మహిళ కింద పడి చనిపోయింది.

- పొదిలి సమీపంలోనూ పలు ప్రమాదాలు జరిగాయి.

ఈ ప్రమాదాల్లో చనిపోయినవారు.. గాయపడినవారు.. అందరూ కూలీలే. మిరపకాయలు ఇతర వ్యవసాయ పనులు చేసుకోవడానికి వెళుతూ ప్రమాదాలకు గురయ్యారు. నిత్యం ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేక చోట్ల జరుగుతూనే ఉన్నాయి. బతుకు దెరువు కోసం పొట్టచేత పట్టుకుని పొలానికి వెళుతుంటే ఇంటికి తిరిగొచ్చే దాకా నమ్మకం లేకుండా పోతుంది. ప్రాణాలు పోతున్నాయి. కుటుంబాల్లో పేద పిల్లలు అనాథలవుతున్నారు. కుటుంబాల పోషణ కోసం మహిళలు చాలా దూరం ఆటోలలో ప్రయాణించి పనులు చేసి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఆటోలలో అనుమతికి మించి కూలీలను ఎక్కించి.. కుక్కుతున్నారు. ఆటోల్లో కేవలం సీట్లలోనే కాకుండా డ్రైవర్ పక్కన నలుగురు, సీట్లో నలుగురు, ఆటో కడ్డీలపైనా, వెనుక డోర్‌పైనా వేలాడుతూ పోతున్నారు. జాతీయ రహదారులపై వేగంగా వెళుతూ ఆటోలు అదుపు తప్పుతున్నాయి. బోల్తా పడుతున్నాయి. జాతీయరహదారితో పాటు ఒంగోలు-కర్నూలు రోడ్డు, మార్కాపురం మీదుగా కనిగిరి వెళ్లే రాష్ట్ర జాతీయ రహదారిపైనా, గిద్దలూరు వెళ్లే రహదారి కంభం సమీపంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. త్రిపురాంతకం మండలంలో ఎక్కువగా ఇలాంటి ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి. ఆటోల్లో కూలీల తరలింపుపై నిఘా లేదు. ఎంత మందిని ఎక్కించుకుంటున్నా పోలీసులు పట్టించుకోవడం లేదు. ఆటోలను ఆపి తనిఖీలు చేయాల్సి ఉండగా కేవలం పెనాల్టీలు వేయడం తప్ప భద్రతా చర్యలు లేవు. పోలీసులు వాహనాల విషయంలో పెనాల్టీలు, వసూలు లక్ష్యాలు చూసుకుంటున్నారు. ఆదాయాలపై తప్ప ప్రమాదాలపై దృష్టి లేదు. ఆటోలకు జాతీయరహదారులపై అనుమతి లేదు. అయితే ఆటో యజమానులు ఆందోళనలు చేశారు. దీంతో పరిమితంగా అనుమతించారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు ఆటోవాలాలు ఓవర్‌లోడుతో వేగంగా వెళుతున్నారు. ఇక గ్రామీణప్రాంతాల్లో పొలాలకు కూలీలను తీసుకొని పోవడానికి ఆటోలే ప్రధాన రవాణాకు మార్గమయ్యాయి. గతంలో ట్రాక్టర్లు వినియోగించేవాళ్లు.. డీజిల్ ధర వంద దాటాక వాటి వ్యయం ఎక్కువగా ఉన్నందున రైతులు కూడా ఆటోలవైపే మొగ్గు చూపుతున్నారు. ఉదయం కూలీలను పొలాల్లో వదిలేసి వస్తారు. మిగతా సమయాల్లో బాడుగలు చూసుకుంటున్నారు. మళ్లీ ▶ 2లో

'ప్రకాశం'ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం..

- జాయింట్ కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్
- ఘనంగా జిల్లా అవతరణ దినోత్సవ వేడుకలు



డాక్టర్ రంగారావును సత్కరిస్తున్న జేసీ అభిషిక్త్‌కిషోర్, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాకు చెందిన మహనీయుల స్ఫూర్తితో ప్రకాశం జిల్లాను అన్ని విధాలా అభివద్ధి పథంలో నడిపిస్తామని సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా 54వ అవతరణ దినోత్సవ వేడుకలు గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా జెండాను జెసి ఆవిష్కరించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆంధ్రకేసరి విగ్రహానికి జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఏఎస్‌పి నాగేశ్వరరావు, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ప్రకాశం పంతులు మునిమనవడు సంతోష్‌లతో కలిసి పూలమాలలు వేశారు. అనంతరం స్పందన హాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ జిల్లాను అన్ని విధాలా అభివద్ధి చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా ఈ ఏడాదే నీళ్లు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా అభివద్ధి పరంగా జిల్లా రూపురేఖలు మారనున్నాయన్నారు. బెంగళూరు-కడప- విజయవాడ (బి-కె-వి) గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే జిల్లా నుంచి వెళ్ళటం సంతోషమన్నారు. ఈ రహదారి మూడేళ్లలో పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే 565, 544 (డి) రహదారుల ద్వారా జిల్లా పశ్చిమ ప్రాంతం అభివద్ధి చెందుతోందన్నారు. జిల్లా అభివద్ధిలో ప్రజలు కూడా వారి వంతు బాధ్యత నిర్వహించాలని కోరారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్ఫూర్తిదాయకంగా నిలవాలని జెసి సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి వారికి ఉపాధి మార్గాలు చూపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ నాటక, సినిమా, క్రీడలు, వ్యాపార, రాజకీయ రంగాలకు ప్రకాశం జిల్లా పుట్టినిల్లు అని వ్యాఖ్యానించారు. తాను జడ్పీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటివరకు రూ.30 కోట్ల విలువైన అభివద్ధి పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ జిల్లాకు చెందిన విశిష్ట చరిత్ర భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఆవిర్భావం-చరిత్రను తెలిపేలా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాలలో కృషి చేసిన వారిని సత్కరించారు.

డాక్టర్ రంగారావుకి ఘన సత్కారం

జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించిన బెతూన్ నర్సింగ్‌హోం వ్యవస్థాపకులు, ప్రముఖ సీనియర్ వైద్యులు నల్లూరి రంగారావును జేసీ ఎం.అభిషిక్త్ కిషోర్ ఘనంగా సత్కరించారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ▶ 2లో



బాధితులతో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు

అధికార పార్టీ అండ వల్లే

నిందితులను అరెస్టు చేయలేదు..

- దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చెయ్యాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

కొల్లూరు మండలం చింతల్లాంక, పెదలంక గ్రామ దళితులపై మూడు రోజుల క్రితం దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చెయ్యాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. అధికార పార్టీ అండదండలు ఉండబట్టే ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చెయ్యలేదని విమర్శించారు. పెత్తందారుల దాడులలో గాయపడి వైద్యశాల నుండి ఇంటికి వచ్చిన బాధితులను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఎస్‌సి నియోజకవర్గంలో దళితులపై దాడులు జరిగితే స్థానిక శాసనసభ్యులు, మంత్రి నాగార్జున కూడా దళిత వాడను సందర్శించలేదని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. తక్షణమే పోలీసులు సుమోటోగా తీసుకొని గ్రామాలలో తిరుగుతూ దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిని అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కష్ణమోహన్, సిపిఎం మండల కార్యదర్శి టి.సురేష్, నాయకులు వెంకట్రామయ్య, సుబ్బారావు తదితరులు ఉన్నారు.



ఆంధ్రకేసరికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి, జేసీ

'ప్రకాశం'ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. సత్కారాలు పొందిన వారిలో టంగుటూరి సంతోష్, రచయిత, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నాగభైరవ ఆదినారాయణ, నాటకకర్త పాటిబండ్ల ఆనందరావు, ప్రముఖ గాయకుడు నూకతోటి శరత్‌బాబు ఉన్నారు. వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రైల్వే సర్వీసెస్ ఇంజినీర్ జగదీష్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, ఛైర్మన్‌లు, డిఆర్‌ఒ బి.చినఓబులేసు, వివిధశాఖల ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

కూలీలకు భద్రతేదీ?

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రం ఫోను చేయగానే పొలాల వద్దకు వెళ్లి కూలీలను తీసుకుని గ్రామాల్లో వదులుతున్నారు. అయితే ఒక్కో ఆటోలో అనుమతి ప్రకారమైతే ఐదుగురికి మించడానికి వీల్లేదు. ఇప్పుడు 15 మందికిపైగా ఎక్కించుకుంటున్నారు. అందరూ ఒకేసారి వెళతారు. కాంట్రాక్టుకు మాట్లాడుకుని ఎంతోకొంతకు వెళుతున్నారు. ఇక్కడే ప్రాణాలకు ముప్పు వస్తోంది. కిటకిటలాడుతూ వేలాడుతూ పోతున్నారు. వెనుకడోర్‌పైనే నలుగురు కూర్చుంటున్నారు. జాతీయరహదారిలో లారీ నడుమ ఉత్కంఠంగా ఆటోలు వెళుతున్నాయి. ప్రమాదం జరిగితే ఒకరిద్దరు చనిపోతున్నారు. అందరూ గాయాల పాలవుతున్నారు. ఇలాంటి సంఘటనలు రోజూ జిల్లాలో ఎక్కడోచోట జరుగుతూనే ఉన్నాయి. రోడ్డుభద్రతా వారోత్సవాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు భారీగా పెరిగాయి. రోడ్డు నాలుగు, ఆరు వరుసలకు విస్తరణ జరిగినా ప్రమాదాలు ఎందుకు పెరిగాయనే దానిపై పోలీసు, రవాణాశాఖ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

మా భూమి ఇప్పించండి సారూ..!

తహశీల్దారు కార్యాలయం వద్ద బాధితుల ధర్నా

ప్రజాశక్తి-సిఎస్.పురం

తమ భూమిని తమకే ఇప్పించాలని కోరుతూ తహశీల్దారు కార్యాలయం ఎదుట బాధితులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండల పరిధిలోని డిజి.పేట గ్రామ సర్వేనెంబర్ 56, 58లో గ్రామానికి చెందిన షేక్ నన్నేబి, షేక్‌నాగూర్ మీరావలి అనే రైతులకు భూములు ఉన్నట్లు తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకుని ఆ భూములను అదే గ్రామానికి చెందిన ఇతరుల పేరుతో నమోదు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు అధికారులు ముడుపులు తీసుకొని అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో పేర్లు మార్చి రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధితుల భూములు వారిపేరుతో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.చిట్టిబాబు, బి.జేసురత్నం, బాధిత రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఊసా వెంకటేశ్వర్లు

వికలాంగులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వైసిపి ప్రభుత్వం వికలాంగులకు అండగా ఉందని వైసిపి వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్‌రాజ్ తెలిపారు. వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆత్మీయ సదస్సు గురువారం నిర్వహించారు. తొలుత వికలాంగులు చర్చి సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాత జడ్‌పి కార్యాలయం వరకూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహించిన సదస్సుకు ఎల్లాల శివ కృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. సదస్సులో వైసిపి వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజ్ మాట్లాడారు. వికలాంగుల అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తోడ్పతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం జిల్లా నాయకులు కొండరాజు రమణయ్య, మక్కెన సులోచన రాణి, కుమ్మిత వరలక్ష్మీ, కుర్రు జకారియ,యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంకపల్లి బంగారుబాబు, టాన్స్ జండర్ అధ్యక్షురాలు సాయి శ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బందెల కిరణ్‌రాజ్

'వెలిగొండ'కు నిధులు కేటాయించాలని ధర్నా

ప్రజాశక్తి-తర్లుపాడు

రాష్ట్ర బడ్జెట్‌లో శ్రీపూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం మార్కాపురం డివిజన్ నాయకులు గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి ఏరువ పాపిరెడ్డి మాట్లాడుతూ వచ్చే బడ్జెట్‌లో శ్రీపూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలన్నారు. ముంపు గ్రామ ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వారందరికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తవనం రఘురామిరెడ్డి, డి.అంకయ్య, కుందురు చిన్నకోటయ్య, డి.నారాయణ, కె.నారాయణ, డి.వెంకటేశ్వర్లు, ఎ.కోటయ్య, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో సిఐ పరిశీలన

టంగుటూరు : స్థానిక ట్రంకు రోడ్డు లోని బే సైడ్ కాంప్లెక్స్ లో ఉన్న ఫేస్ బుక్ మెన్స్ వేర్ వస్త్ర దుకాణంలో రూ.7 లక్షలకు పైగా నిధులు ఇతర ఖాతాకు మళ్లింపు కేసు విషయం పాఠకులకు విదితమే. అందులో భాగంగా శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ రెడీమేడ్ వస్త్ర దుకాణాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఫోన్ పే స్కానర్ క్యూ ఆర్ కోడ్ మార్ఫింగ్‌ను పరిశీలించారు. అనంతరం దుకాణం యజమానితో నిధుల దుర్వినియోగం జరిగిన విధానం, క్యూ ఆర్ కోడ్ మార్ఫింగ్ తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులో నిందితుడైన శ్రీపతి విజయ్ బాబు ఎంత కాలంగా దుకాణంలో పనిచేస్తున్నాడని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఐ రంగనాథ్ మాట్లాడుతూ దుకాణం గుమస్తా విజయ్ ఫోన్ పే స్కానర్ క్యూ ఆర్ కోడ్ మార్ఫింగ్ చేసి నిధులు ఇతర ఖాతాకు మళ్ళించిన కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సాక్ష్యా ధారాలు లభించిన అనంతరం నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చేతబడి నెపంతో వృద్ధుడి నిర్బంధం

ప్రజాశక్తి-వేటపాలెం

రాకెట్ యుగంలో కూడా చేతబడులు సముద్ర తీర ప్రాంతాల గ్రామస్తులు వదలటం లేదు. మూఢనమ్మకాలతో వ్యక్తులను నిర్బంధిస్తున్నారు. తమతో గ్రామంలో కలిసి జీవించే వ్యక్తిని నిర్బంధించి చేతబడి చేసిందెవరో చెప్పాలంటూ రాత్రంతా కట్టేసి ఉంచిన అనాగరిక చర్య వెలుగుచూసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రేక్షకపాత్ర పోషిస్తూ ఉండటం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. వేటపాలెం మండలం అక్కయ్యపాలెం పంచాయతీ రామాపురం తీరప్రాంత గ్రామంలో ఉన్న పామంజి శేషగిరిరావు ఉరఫ్ శేషయ్య వృద్ధుడు. బుధవారం రాత్రి 7 గంటల నుంచి గురువారం మధ్యాహ్నం 2 గంటల వరకు చేతబడి చేసింది ఎవరో చెప్పాలంటూ నిర్బంధించారు. రామాపురం గ్రామానికి చెందిన వాయిల వెంకటేశ్వర్లు, వాయిల పోలయ్య, వాయిల నరసింహ అనే వ్యక్తులు చనిపోవటానికి కారణం చేతబడేనని గ్రామపెద్దలు ఆరోపించారు. వాయిల పోలయ్య ఇంటి ప్రాంగణంలో వెంట్రుకలు, ఎముకలు, పసుపు కుంకుమ మూటకట్టి పూడ్చి పెట్టారని పెద్దలు కొందరు 15 సెకన్ల నిడివి కలిగిన వీడియోను అక్కడకు చేరుకొన్న పోలీసులకు, మీడియాకు చూపుతున్నారు. గ్రామ పెద్దలు విలేకరులను ఫొటోలు కూడా తీయనీయకుండా సెల్ ఫోన్లు లాక్కున్న కూడా అక్కడే ఉన్న ఈపురుపాలెం ఎస్ఐ జనార్దన్ చూస్తూ నిలబడిపోయారు. ఘటనా స్థలానికి చీరాల రూరల్ సీఐ ఏ మల్లికార్జునరావు, చీరాల డిఎస్‌పి పి శ్రీకాంత్‌లు జీపు దిగకుండానే ఆదారి గుండానే రామాపురం సిబిజి ఎదురు అవుట్ పోస్టింగ్ నిర్మాణానికి శంకుస్థాపనకి వెళ్లిపోవడం



బాధిత వృద్ధుడు శేషయ్య

విశేషం తిరుగు ప్రయాణంలో సిఐ నిర్బంధించిన శేషగిరిరావు వద్దకు చేరుకొని గ్రామస్థులతో చర్చించారు. గ్రామస్థులు ససేమిరా అని భీష్మించుకు కూర్చున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మరో దఫా గ్రామపెద్దలతో చర్చలు జరిపి డిఎస్‌పి శ్రీకాంత్ మీడియాతో పామంజి శేషగిరిరావు అనే వ్యక్తి చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో గ్రామపెద్దలు పంచాయతీ ఏర్పాటు చేసుకొన్నారు. పంచాయతీ ముగిసింది అంటూ తన వాహనం ఎక్కి వెళ్లిపోయారు. పోలీసులు బాధితుడ్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. సెల్ ఫోన్ లాక్కొన్న గ్రామపెద్దలు వలన పైన స్క్రీన్ కార్డు పగిలిందని పోలీసులకు చెబుతుంటే ఇంకా నయం సెల్ ఇచ్చారు సంతోషించు అని అనటం ఆ ప్రాంత ఉద్రిక్తత సంఘటనను తెలుసుకోవచ్చు.

చీరాల నియోజకవర్గంలో రెండు సంవత్సరాల క్రితం జరిగిన రాజకీయ ఆధితప్య పోరులో రామాపురంలో జరిగిన తలెత్తిన హింసాత్మక సంఘటనల్లో బాదితుడు శేషగిరరావుకు, గ్రామస్తులకు 45 గ్రామాల తీరప్రాంతాల పెద్దలు రాజీకుదిర్చారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆధిపత్యపోరు ఆపడానికి రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలనాయుడు, మోపిదేవి వెంకట రమణ, బాలినేని శ్రీనివాసరావులు జోక్యం చేసుకొని సద్దుమణిగించారు. గ్రామస్థులు, పెద్దలు బుధవారం నుండి కూత వేసి ఎవ్వరూ వేటకు వెళ్లరాదని అందరూ అందుబాటులో ఉండాలని తీర్మానం చేశారు. ఏదిఏమైనా తీరప్రాంతాల్లోని గ్రామాల్లో ఇప్పటికి కట్టుబాట్లు, ఎవరైనా తప్పు చేస్తే జరిమానా వేస్తే పద్ధతి ఇప్పటికి కొనసాగుతున్నదనేది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలోనే ఆగ్రామాల్లో అధికార యంత్రాంగం పట్టు సాధించలేకపోతుందనే విమర్శలు ఉన్నాయి. ఈ గొడవ ఇంతటితో సద్దుమణుగుతుందా లేదా రాజుకొంటుందా అనేది వేచిచూడాల్సిందే.

బాధితుడిని హాస్పటల్‌కు పంపించాం: పి శ్రీకాంత్, చీరాల డిఎస్‌పి

రామాపురం గొడవ సద్దుమణిగింది. పామంజి శేషగిరిరావు చేతబడి చేస్తున్నారు అనే అనుమానంతో గ్రామస్థులు పంచాయతీ పెట్టుకొన్నారు. పంచాయతీ ముగిసింది. మధ్యాహ్నం బాధితుడిని హాస్పటల్‌కు పంపించాం. ప్రస్తుతం బాధితుడు ఎక్కడ ఉన్నాడో ఏమో తెలియదు.



అగ్ని ప్రమాదంలో చెలరేగిన మంటలు

బాపట్లలో అగ్నిప్రమాదం..

రూ.4 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల పట్టణం 12వ వార్డు వెంగల విహార్‌లో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 3 దూలాల పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిందని బాపట్ల అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. సుమారు ఆస్తి నష్టం రూ.4 లక్షలుగా ఉంది. నగదు రూ.50 వేలు, 3 గ్యాస్ సిలిండర్లు, 3 బీరువాలు ఇంటి సామాన్లు దగ్ధం అయ్యాయన్నారు. ఇంటి యజమానులు భవన నిర్మాణ కార్మికులు, చింతా సుదేవ్ కుమార్, నాగరాజు, కనక రాజులు కూలి పనికి వెళ్లినప్పుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చామని తెలిపారు. రూ.2 లక్షల ఆస్తిని కాపాడినట్లు చెప్పారు. డిఎఫ్ఒ సి మాధవ నాయుడు పర్యవేక్షించారు. సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని అనంతవరం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సమాచారంపై గురువారం ఎస్ఐ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో దాడి చేశారు. గ్రామానికి చెందిన కసుకుర్తి అంజయ్య అక్రమంగా విక్రయిస్తున్న 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతడిని టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంజయ్యను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఖాదర్‌బాషా తెలిపారు.

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్టు మృతి

ప్రజాశక్తి-పామూరు



సీనియర్ జర్నలిస్టు, మాజీ విశాలాంధ్ర రిపోర్టరుగా పనిచేసిన గుత్తి శ్రీనివాసులు అలియాస్ దేవుడు(50) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందినట్లు అతని సోదరుడు గుత్తి రాజా తెలిపారు. బుధవారం జర్నలిస్టు యూనియన్ నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు పలు రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో బత్తుల నాగేశ్వరరావు, షేక్ రెహమాన్, షరాబు చంద్ర, సుప్రీం రెహిమాన్, రాజేష్, సాయి, మాజీ ఎంపిటిసి ఇర్రి కోటిరెడ్డి, వెంకటరెడ్డి, మౌలాలి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రకాశం' పేరు పెట్టడం అభినందనీయం

ప్రజాశక్తి-దరిశి: ప్రకాశం జిల్లాకు టంగుటూరు ప్రకాశం పంతులు పేరు పెట్టడం అభినందనీయమని తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాళ్లూరు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న టంగుటూరు ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుబ్బయ్య, ఇఒఆర్‌డి ప్రసన్న, సర్పంచ్ చార్లెస్ సర్జన్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

కావూరు గ్రామంలోని రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో వార్షిక కళ్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో విటల్ శ్రీనివాస్ వర్మ తెలిపారు. రెండో రోజు స్వామివారికి మయూర వాహన సేవ నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

కొలుకులలో పులి సంచారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల బీట్ పరిధిలో చిరుత పులి సంచరించినట్లు ఆ ప్రాంత ప్రజలు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీనితో గురువారం సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఆ ప్రాంతంలో పరిశీలించారు. పులి కాలి ముద్రలను పరిశీలించారు. అడవి నుంచి నీటి కోసం అటవీ జంతువులు అలా తిరుగుతూ వస్తుండటం సహజం అని అన్నారు. అయితే రైతులు, ప్రజలు రాత్రి వేళల్లో అటు వెళ్లకుండా ఉండటం మంచిదని అన్నారు. కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అటవీ సిబ్బంది ఎల్లవేళలా బీట్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. భయపడాల్సిన పని లేదని చెప్పారు.

సిఎం జగన్‌కు క్షీరాభిషేకం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి అధ్యక్షతన మండల టైలర్స్ అసోసియేషన్ వారు జగనన్న చేదోడు పథకం ఇచ్చిన సందర్భంగా సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రిబ్కా ప్రసాద్, వైసిపి మండల కో కన్వీనర్ చల్లా ఎల్లారెడ్డి, టైలర్స్ టి కోటి, దాదా, కరీముల్లా, వెంకటేశ్వర్లు, శ్రీను మరియు టైలర్ల సోదరులు, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని దంపతులకు గాయాలు

ప్రజాశక్తి-ముండ్లమూరు



ప్రమాదంలో గాయపడిన దంపతులు

మండలంలోని పసుపుగల్లు గ్రామం వద్ద గురువారం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. అనంత పురం జిల్లా హిందూపురం గ్రామానికి చెందిన సాయి విజయకృష్ణ, రసూల్‌బీ దంపతులు తమ మోటారు బైకుపై విజయవాడ వెళ్తుండగా పసుపుగల్లు గ్రామ సమీపంలోని సాయిబాబా గుడి వద్ద టివిఎస్ ఎక్సెల్ ఢీకొట్టడంతో సాయి విజయకృష్ణ, రసూల్‌బీ రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యాయి. వీరిని 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని ముండ్లమూరు ఎస్ఐ సంపత్‌కుమార్ తన సిబ్బందితో పరిశీలించి యాక్సిడెంటుకు గురైన వాహనాలను స్టేషన్‌కు తరలించారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి-దరిశి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలని తాళ్లూరు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి అన్నారు. ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా తాళ్లూరులోని మహాత్మాగాంధీ జాతీయ హామీ ఉపాధి కార్యాలయం వద్ద వారు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు మొక్కలు నాటి పెంచాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుబ్బయ్య, ఎపిఎం మురళి, ఇసి ప్రసాద్, ఇఒఆర్‌డి ప్రసన్న, శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

4న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-దరిశి

ఒంగోలు జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వాకా జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయులు పెద్దఎత్తున ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.


దరిశి పట్టణంలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-దరిశి

దరిశి పట్టణంలో రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమీషనరు వై మహేష్ తెలిపారు. ప్రొక్లయిన్‌తో కురిచేడులో రోడ్‌లోని ఆక్రమణలు తొలగించారు. అన్ని రోడ్లలలో ఆక్రమణలు తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధ వెంకన్న దంపతులకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-పామూరు



శుభాకాంక్షలు తెలుపుతున్న కేశినేని, దారపనేని

విజయవాడ రాజకీయ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ వెంకన్న, భూలక్ష్మి దంపతులకు విజయవాడ రాజకీయ సీనియర్ నాయకులు కేశినేని ట్రస్ట్ బోర్డు చైర్మన్, కేశినేని శివనాథ్ (చిన్ని), కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్‌లు 32వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి గజమాలవేసి దుసాలువతో దంపతులిద్దరికీ అభినందనలు తెలిపారు. మాకు అత్యంత సన్నిహితులు, మిత్రులు, ఆప్తులు, అయినటువంటి బుద్ధ వెంకన్న దంపతులు ఇటువంటి వివాహ వార్షికోత్సవాలు ఎన్నో జరుపుకోవాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామని అన్నారు. వారిరువురు అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని కేశినేని, దారపనేని పేర్కొన్నారు.

ఆకలి తీర్చి.. సపర్యలు చేసి..

వృద్ధురాలి పట్ల మానవత్వం చాటిన మహిళా కార్యదర్శి

ప్రజాశక్తి-చీరాల

మానవత్వం ఇంకా బతికే ఉందని నిరూపించారు ఓ మహిళా పంచాయతీ కార్యదర్శి. వృద్ధురాలికి ఆమె చేసిన సేవలు, సపర్యలు స్థానికులను ఆలోచింపచేసేలా చేశాయి. పట్టణ నడిబొడ్డు గడియార స్తంభం కూడలిలో పండు వృద్ధురాలు ఆకలితో అలమటిస్తూ ఎవరినీ అడగలేని నిస్సహాయ స్థితిలో మధ్యాహ్నం నుంచి అలాగే సొమ్మసిల్లి కూర్చుండిపోయింది. నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో ముసలమ్మ దీనస్థితిని ఎవరూ పట్టించుకోలేదు. అయితే అదే మార్గంలో వెళుతున్న కొమరునేనివారిపాలెంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వేటపాలేనికి చెందిన బొట్టు దివ్య అనే మహిళ ముసలమ్మ దీనస్థితిని తన ద్విచక్ర వాహనంపై వెళుతూనే గమనించారు. భోజనం కట్టించుకొని వచ్చి ముసలమ్మకు తినిపించి వెళ్లిపోయారు. మరలా సాయంత్రం ముసలమ్మ దీన పరిస్థితి ఎలా ఉందో అని ఆ వృద్ధురాలి గురించి ఆలోచించి గడియార స్తంభం సెంటర్‌లో ముసలమ్మ కూర్చున్న చోటుకు వెళ్లి పరామర్శించారు. ఆమె దాహాన్ని తీర్చేందుకు దగ్గరలోని జ్యూస్ షాపులో జ్యూస్ కొనుగోలు చేసి గ్లాసులో పోసి ఆ వృద్ధురాలి చేత తాగించారు. అయిన వాళ్లనే పట్టించుకోని నేటి సమాజంలో ఏమీ కాని, రోడ్డుపై ఉన్న ముసలమ్మ గురించి ఆలోచించి ఆమెకు సేవ చేసిన ఆ మహిళా కార్యదర్శి దివ్య సేవల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ దృశ్యాలను ప్రజాశక్తి కెమెరా క్లిక్ మనిపించింది.





పండ్ల రసం గ్లాసులో పోస్తుంటే ప్రాణం లేచివచ్చినట్లుగా చూస్తున్న వృద్ధురాలు.. ఆమెకు జ్యూస్ తాపిస్తున్న పంచాయతీ కార్యదర్శి దివ్య



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేక అధికారి రాజేష్

డ్రాపవుట్లను అరికట్టాలి: ప్రత్యేక అధికారి

ప్రజాశక్తి-సంతమాగులూరు

పాఠశాల డ్రాప్ అవుట్‌లను, మధ్యలో బడి మానేసిన విద్యార్థులను గుర్తించి, తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజేష్ అన్నారు. గురువారం మండలంలోని మిన్నేకల్లు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మధ్యాహ్నం భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం విద్యార్థులకు అందుతున్న తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎట్రావారిపాలెం సచివాలయం రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ శరత్‌బాబు

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి సచివాలయం

ప్రజాశక్తి-కర్లపాలెం

ప్రభుత్వానికి ప్రజలకు వారధి సచివాలయమని, సిబ్బంది అందరూ నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిఎల్‌పిఒ శరత్‌బాబు అన్నారు. గురువారం కర్లపాలెం మండలం ఎట్రవారిపాలెం గ్రామంలో సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది అందరూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మావతి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థి రవితేజను అభినందిస్తున్న క్రీడా నిర్వాహకులు

చీరాల హైస్కూల్ విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-చీరాల

చీరాల ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ విద్యార్థి టి రవితేజ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్, ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో బంగారు పతకం సాధించాడు. జగ్గయ్యపేట ఉక్కు కళా వేదికలో జరుగుతున్న పోటీలలో విద్యార్థి పాల్గొన్నాడు. గతంలో రవితేజ పలు పోటీలలో పాల్గొని అనేక పథకాలు సాధించాడు. అయితే నేడు జరిగిన పోటీలలో పథకాన్ని సాధించటం పట్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఏ వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె రాణి, ఎన్‌సిసి అధికారి పి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరెన్నో పథకాలు సాధించి పాఠశాల కీర్తిస్తున్న రాష్ట్ర నలుదిక్కులా చాటాలని ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి టి బాలాజీ గంగాధర్

ఈ క్రాప్ నమోదు చేయించుకోండి: ఏవో

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ప్రస్తుత రబీ సీజన్లో రైతులు తమ పంటలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి టి బాలాజీ గంగాధర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గుల్లపల్లి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు, విస్తరణ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ రైతులందరికీ రెండో పంట కూడా ఈ పంట నమోదు ఆవశ్యకతను వివరించి తప్పనిసరిగా ఈకేసి చేయించాలని అన్నారు. ఈ పంట నమోదు చేయకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ పథకాలు, నష్టపరిహారాలు అందవని, కనుక రైతులందరి చేత ఈకేవైసీ నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మాధవి, ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజబెత్, చిత్రంలో సిహెచ్ మజుందార్

అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి ఆరో తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పి రేఖ ఎలిజిబెత్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల ఆఫీసులో విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలకు గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీలు సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. 2017 నుంచి టిఏ బిల్లు కూడా చెల్లించలేదని, అంగన్‌వాడీలో ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంపుదలేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనం పెంచుతానని హామీ ఇచ్చినా ఆచరణలో అమలు చేయలేదని విమర్శించారు. ఫేసు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి ఆరో తేదీన జరిగే ధర్నాలు జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్స్ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ పాల్గొన్నారు.

ప్రయోజనం లేని కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

సామాజిక న్యాయానికి అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం మజరా మండేవారిపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామస్తులు, యువకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం బాపట్ల జిల్లా కన్వీనర్ కె శరత్ మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ వల్ల దళితులు, గిరిజనులకు ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. ఈ బడ్జెట్ లోనయినా, దళిత గిరిజనుల అభివృద్ధికి, సాధికారతకు, తగ్గ బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయని ఆశించారు. కానీ గత సంవత్సరం దళితుల అభ్యున్నతికి 1819.52 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ సంవత్సరం 976.86 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. అదే విధంగా 8.6 శాతం జనాభా శాతం కలిగిన గిరిజనులకు బడ్జెట్‌లో 2.7 శాతం నిధులు మాత్రమే కేటాయించడ మంటే దేశంలోని దళిత గిరిజనుల అభివృద్ధికి ఆటంకం కలిగించడమేనని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్నే మరిచిపోవడం దారుణమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వున్న దళిత గిరిజన యువతకు అంతో ఇంతో ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకానికి ప్రతి సంవత్సరం 29 వేల కోట్ల రూపాయలు తగ్గిస్తూ ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యు అశోక్ బి దినేష్, సిహెచ్ కార్తీక్, ఎం వర్ధన్, ఎం రాహుల్, జి మధు తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ప్రజలు

5న అమర వీరుల స్మారక సభ

జయప్రదానికి సిపిఎం వినతి

ప్రజాశక్తి-రేపల్లె

భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ, రేపల్లెలోని నెహ్రూ బొమ్మ వద్ద జరిగే తాలూకా అమరవీరుల స్మారక సభను జయప్రదం చేయాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మణిలాల్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమంలో పాత రేపల్లె తాలూకా ఉద్యమం కీలకమైన పాత్ర కలిగిఉన్నదని అన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వాన కష్టజీవుల ఉద్యమాలు ఎన్నో జరిగాయన్నారు. రేపల్లె ప్రాంతంలో ప్రజల కోసం పోరాడుతూ పలువురు అశువులు బాసారన్నారు. అమరవీరులు దాసరి సుబ్బయ్య ఇసుకపల్లి, మోటూరు హనుమంతరావు (వెల్లటూరు), గుమ్మడి సీతారామయ్య (గుడికాయలంక), కంఠంనేని వెంకటరత్నం (పల్లెకోన), కస్తూరి కుటుంబరావు (కనగాల), ముత్తురెడ్డి వెంకటాచలం (ఓలేరు), మండవ కోటేశ్వరరావు (ఆమదలంక) అమరవీరులను స్మరించుకునేందుకు జరుగుతున్న బహిరంగసభకు ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ, ఆదివారం, సాయంత్రం 4 గంటలకు రేపల్లె నెహ్రూ బొమ్మ వద్ద జరిగే సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కే రమేష్, జి దానియేలు, వి మావో జే ధర్మరాజు, ఎం సూర్య ప్రకాష్, ఎల్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు మణిలాల్

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయం

పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు అన్యాయం జరిగినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వరు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఎంపిడిఒ కార్యాలయం ఎదుట బడ్జెట్ కాపీలను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా బడగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కోతల బడ్జెట్, పేదలపై వాతల బడ్జెట్ అని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి గత సంవత్సరంతో పోలిస్తే రూ.30 వేల కోట్లు తగ్గించినట్లు విమర్శించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత కుదించేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన హామీలను గాలికి వదిలేసినట్లు తెలిపారు. ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక భద్రత రంగాలకు నిధులు కేటాయించలేదని తెలిపారు. జిల్లాలో వెలుగొండ ప్రాజెక్టు,సోలార్ విద్యుత్తు, పరిశ్రమలకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడం అభివద్ధి నిరోధకానికి సూచిక అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైసిపి, ప్రధాన ప్రతి పక్ష పార్టీలు కేంద్ర వైఖరిని ఎండగట్టడంతో వెనుకంబ వేస్తున్నాయని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేస్తుంటే మోడీకి భజన చేయటం దారుణమన్నారు. ఇప్పటికైనా తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పోతురాజు మంగయ్య, గురునాథం, రాములు, కత్తి ఏభూ, ఉపాధి హామీ పథకం యూనియన్ నాయకులు కత్తి మత్తయ్య, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గంద్ర వెంకటేశ్వర్లు, సురేంద్ర, రవి, పిచ్చిరెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : కేంద్ర బడ్జెట్ బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందే తప్ప పేద మధ్యతరగతి ప్రజలకు ఉపయోగం లేదని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలోఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణమని తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధుల్లో కోత పెట్టినట్లు తెలిపారు. దళిత, గిరిజనుల అభివద్ధికి ఎటువంటి నిధులు కేటాయించలేదని తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఉప తహశీల్దారు హరిబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గుమ్మా బాలనాగయ్య, వెంకటేశ్వర రెడ్డి, కొమ్ము డేవిడ్, యేసయ్య, షేక్ నాయబ్ రసూల్, గంగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. **కొండపి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా, వ్యవసాయ కార్మిక, రైతు, కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ మండల పరిధిలోని మిట్టపాలెం, ముప్పవరం, కొండపిలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కెజి.మస్తాన్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతు, పేదల వ్యతిరేక బడ్జెట్ అని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి రూ. 30వేల కోట్లు నిధులు కోతపెట్టినట్లు తెలిపారు వ్యవసాయ రంగాన్ని పూర్తి దివాలు తీసే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని తెలిపారు. బడ్జెట్ కేవలం కార్పోరేట్ శక్తులకు ఉపయోగపడేవిధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పారాబత్తిన శ్రీనివాసులు, జి.వందనం, శేఖర్, గోవిందమ్మ, మాల కొండయ్య, రాఘవులు పాల్గొన్నారు. **సంతనూతలపాడు :** కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ రంగానికి నిధులు తగ్గించడాన్ని నిరసిస్తూ వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పోరేట్లకు అనుకూలంగా ఉందన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వల్ల పేదలు పని దినాలు కోల్పోతారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ అమలు చేయాలని కోరుతున్న తరుణంలో పథకాన్ని కూడా నీరుగార్చేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఈదర సుబ్బారావు, అన్నవరపు శేషారావు, నాయకులు ఆర్.జార్జి, జి. ఆంజనేయులు, దారా సుబ్బారావు, ఇస్తర్ల రాములు, కె. సింగయ్య పాల్గొన్నారు.



హనుమంతునిపాడులో నిరసన తెలుపుతున్న నాయకులు



సంతనూతలపాడులో నిరసన తెలుపుతున్న నాయకులు



మార్కాపురంలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు



కొండపిలో నిరసన తెలుపుతున్న కూలీలు, నాయకులు

ప్రజల మనసులో..

చెరగని ముద్ర వేసుకున్న భక్తయ్య

- 4న వర్ధంతి సభ
- ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామ మాజీ సర్పంచి కామ్రేడ్ గోగినేని న్యాషాభక్త రాజు(భక్తయ్య) మరణించి 39 సంవత్సరాలైన నేటికీ ఆయన ప్రజల మనస్సుల్లో చెరగని ముద్రవేసుకున్నారు. భక్తయ్య 1902లో ఉప్పుగుండూరులో ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. అయినప్పటికీ నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటం సాగించారు. 30 సంవత్సరాల పాటు గ్రామ సర్పంచిగా, 30 సంవత్సరాలు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఊర చెరువు ట్రస్టీ, వేణుగోపాల స్వామి ఆళ్వారాజుల దేవస్థానం కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. గ్రామాభివద్ధికి ఎనలేని కషిచేశారు. కమ్యూనిస్టుగా రాజకీయ జీవితం ప్రారంభించి రైతాంగ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. సామాజిక న్యాయం కోసం నిర్వహించిన పోరాటాలకు అండగా నిలిచారు. యువతను అభ్యుదయ మార్గంలో నడిపించేందుకు యువజన బాలసంఘాలు తోపాటు ప్రజానాట్యమండలి దళాలను ఏర్పాటు చేశారు. వారికీ అనేక వీధినాటికలు నేర్పించి ప్రజలను చైతన్యపరిచే విధంగా అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.



అప్పట్లో దళితులను గ్రామంలోకి రానివ్వని పరిస్థితుల్లో వారి కోసం ప్రత్యేకంగా రెండు బావులు తవించారు. అంతే కాకుండా తన ఇంటిలోని బావి నుంచి నీరు తీసుకెళ్లేందుకు ఎప్పుడూ తలుపులుతీసి ఉంచేవారు. వీధినాటికలకు తనఇంటినే విడిదిగా ఏర్పాటు చేశారు. పేదల పోరాటాలకు బాసటగా నిలిచి తనవంతు సహ కారాన్ని అందించేవారు. తన జీవింతాంతం పేదప్రజల పక్షాన నిలిచారు. భక్తయ్య లాంటి నిస్వార్ధపరుల సేవలను గుర్తుచేసుకుంటూ నేటి యువత ఆయన్ని స్ఫూర్తిగా తీసుకొనే విధంగా గ్రామంలో గ్రామస్తులు భక్తయ్య విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేశారు. గత 7 సంవత్సరాల నుంచి వైద్యశిబిరాలు, మహిళలకు కుట్టు శిక్షణ, ప్రజలకు సామాజిక అవగాహణ కల్పించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్‌లో గ్రామాభివద్ధితోపాటు ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు భక్తయ్య గారిపేరున భవణం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు.

4న ఉచిత వైద్యం శిబిరం

ఈనెల 4న భక్తయ్య వర్ధంతి సభ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి సహకారంతో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈశిబిరంలో బిపి, షుగర్, కిడ్నీ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని స్థానిక ఎస్ఐ హరిబాబు ప్రారంభిస్తారన్నారు

4 నుంచి భవన నిర్మాణ పనులు ప్రారంభం

భక్తయ్య పేరుతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు ఈనెల 4 నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు అనంతరం బస్టాంట్ కూడలిలో వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మైనంపాడు ప్రజానాట్యమండలి బాలబాలికలచే కోలాటం, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈకార్యక్రమానికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

ప్రజల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరు, మద్దిరాలపాడు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గహ రథసారధులకు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వాలంటీర్లు, కన్వీనర్లు గహరథసారధులు ప్రభుత్వం పథకాలను ప్రజలకులోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి యాదల రత్నభారతి, వైసిపి నాయకులు నలమలపు కష్ణారెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, ఇనగంటి పిచ్చిరెడ్డి, మారెళ్ళ బంగారుబాబు, పి. కోటయ్య, మారెడ్డి సుబ్బారెడ్డి, ఉప్పుగుండూరి శ్రీనివాసప్రసాదు,కూనం పూర్ణయ్య, వైకుంఠ వీరాంజనేయులు, కె. సుధాకర్ , కె.విజయకుమార్ ,మాదాసు రాంబాబు, కె. సురేష్ బాబు,వజ్రం బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలోని తూర్పు క్రిష్టియన్ పాలెంలో పిచ్చి మొక్కల తొలగింపు, మురుగు కాలువల శుభ్రత పనులను కమిషనర్ వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఆప్రాంతంలో నిర్వహణ లోపంతో నిరుపయోగంగా ఉన్న బయో టాయిలెట్లను వినియోగంలోకి తీసుకు రావాలని సిబ్బందికి సూచించారు. రాజీవ్ గృహకల్ప నాలుగోలైన్‌లో మురుగునీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, శానిటరీ మేస్త్రీలు ఉన్నారు.

నేడు సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-కొండపి

గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహరథసారధులకు కామేపల్లి రోడ్డులోని సీతారామకల్యాణ మండపంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, జడ్‌పిటిసి, ఉప్పలపాడు, వెన్నూరు, చోడవరం, గోగినేనివారిపాలెం, పెరిదేపి ,నేతివారి పాలెం, కట్టావారి పాలెం గ్రామ సచివాలయ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహరథసారధులు, సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

లక్ష్యం పూర్తి కాకపోతే మెమోలు

ప్రజాశక్తి- కొత్తపట్నం

ఇంటి పన్నులు వసూలులో లక్ష్యం పూర్తికాని కార్యదర్శులపై శాఖా పరమైన చర్యలు తీసుకుని మెమోలు జారీ చేయాలని ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారి పి. పద్మ తెలిపారు. మండల పరిధిలోని అల్లూరు సచివాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఇఒఆర్‌డిఒలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ఒంగోలు డివిజన్‌లో 30 శాతం పన్నులే వసూలు చేసినట్లు తెలిపారు. మిగిలిన 70 శాతం పన్నులు ఈనెల 15లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఒంగోలు డివిజన్‌లో రూ. 23,20, 12, 335 రూపాయల డిమాండ్‌కు గానూ ఇప్పటి వరకూ రూ.7, 34, 21, 021 రూపాయలు వసూలు చేసినట్లు తెలిపారు. కొత్తపట్నం మండల పరిధిలోని అల్లూరు, మడనూరు, కొత్తపట్నం, ఈతముక్కల గ్రామాల్లో పన్నుల బకాయిలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి బాల చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి రామారావు, హిమబిందు పాల్గొన్నారు.

సంకల్ప దీక్షను జయప్రదం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పొదిలి

విజయవాడ సమీపంలో ధర్మస్థలి వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న సంకల్ప దీక్షను విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సిపిఎస్ సబ్ కమిటీ ఆన్‌లైన్ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఒ.వి.వీరారెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా సిపిఎస్ ఉద్యోగులు, పెన్షన్ ఉద్యోగులు విభజించి సమావేశాలు నిర్వహించడం తగదన్నారు. ఉద్యోగ భద్రత లేని జిపిఎస్‌ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు సంబంధించి పిఎఫ్ లోన్లు క్లోజర్స్, ఎపిజిఎల్ఐ క్లోజర్స్, డెత్ క్లెయిమ్స్, లోన్లు సరెండర్ లీవ్ మెడికల్ రీయింబర్స్‌మెంట్స్, గ్రాట్యూటీ వెంటనే చెల్లించాలన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల మధ్య ఐక్యమత్యంగా లేకుండా ఉంటే పాత పెన్షను విధానాన్ని సాధించలేమని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి మాట్లాడుతూ పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోక్కిరెడ్డి బాబు రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ హై తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల పరిధిలోని కంకణంపాడు, అగ్రహారం గ్రామాల్లో రైతులు సాగు చేసిన కంది పంటను అధికారులు గురువారం పరిశీలించారు. తొలుత రైతు ముల్లంగి లక్ష్మీనారాయణ కంది పంట, అనంతరం జంగం నరసాయపల్లి గ్రామంలోని కటుకూరి మీరయ్య కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ నరేందర్, వెలిగండ్ల మండల కోఆర్డినేటర్ నాగార్జున, కనిగిరి రెవెన్యూ డివిజన్ ఉపగణాంక అధికారి సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

పశు దాణా పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఒంగోలు పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ షేక్ కాలేషా మండల పరిధిలోని అమానిగుడిపాడులోని ప్రభుత్వ పశువైద్యశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పశువైద్యశాల పరిధిలోని గుర్రపుశాలలో ఒంగోలు జాతికి చెందిన ఇరవై కోడెలకు 175 కేజీల దాణా, కాల్షియం, మినరల్ మిక్చర్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివారెడ్డి, పశు వైద్య సహాయకుడు గురవయ్య, సిబ్బంది షబ్బీర్, మజీద్, ఖాసింవలి, ఎల్లారెడ్డి, రాజశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పెద్ద దోర్నాలలోని శాఖా గ్రంథాలయాన్ని మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ మస్తాన్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. కొత్తగా వచ్చిన పుస్తకాల లిస్టులను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు, పాఠకులు పాల్గొన్నారు.

జిల్లా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

స్థానిక కష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఆవిర్భావం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కష్ణవేణి స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వర్షిణి

ఆక్వాజోన్‌పై గ్రామసభ

ప్రజాశక్తి -శింగరాయకొండ

రొయ్యల చెరువుల రైతులు తమ భూములను ఆక్వాజోన్‌లో చేర్చుకోవాలని మత్స్యశాఖ అధికారి వర్షిణి తెలిపారు. శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ సచివాలయంలో రొయ్యల చెరువుల యాజమానులతో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షిణి మాట్లాడుతూ పాత శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని 30 ఎకరాలు ఆక్వా జోన్‌లో ఉన్నట్లు తెలిపారు. మరో 49 ఎకరాలు చేర్చుకోవాలని గ్రామస్తులు, రైతులతో గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆక్వాజోన్‌లో చేరిన రైతులకు ప్రభుత్వం అన్ని రకాల రాయితీలు అందించనున్నట్లు తెలిపారు. ఆక్వా రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వల్లూరి రాజ్యలక్ష్మి,కార్యదర్శి సింగరాజు మారుతి బాబు, మత్స్యశాఖ అధికారులు ప్రదీప్, తిరుపతయ్య, నాగేశ్వరరావు, వైసిపి నాయకుడు గాలి బుజ్జి, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి -శింగరాయకొండ



ఆటోడ్రైవర్లకు కార్డులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ

ఆటో డ్రైవర్ల ఎస్ఐ ఫిరోజాఫాతిమా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా క్యూఆర్ కోడ్‌తో కూడిన కార్డులు అందజేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలో ఎక్కిన ప్రయాణికులు తమకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆటోలోని క్యూఆర్ కోడ్‌ను తమ ఫోన్‌లో స్కాన్ చేసుకోవాలన్నారు. తద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ప్రయాణికులు కూడా విషయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** ఆటోడ్రైవర్లు మాత్రం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తహశీల్దారు రవీంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొలుకుల, వీరభద్రాపురం గ్రామాల పరిధిలోని ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రయాణికులు, కూలీలతో మాట్లాడారు. ఆటోల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఐ రామకృష్ణ, ఎఎస్ఐ మూర్తి, రెవెన్యూ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డీప్ బోరుకు మరమ్మతులు

పొదిలి: పొదిలి నగర పంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు కంభాలపాడు మాజీ సర్పంచి పులగొర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో డీప్ బోరుకు గురువారం మరమ్మతులు చేయించారు. రానున్న వేసవి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి ఆదేశాలతో గ్రామంలో నిరుపయోగంగా ఉన్న డీప్ బోర్‌కు మరమ్మతులు చేసి పైపులైన్‌ను పునరుద్ధరించారు. నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్ చొరవ తీసుకుని డీప్ బోరుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే నాగార్జున రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : వరికూటి

పొన్నలూరు : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని జడ్.మేకపాడు, ఒరుగంటివారిపాలెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, వైసిపి మండల కన్వీనర్ పలనాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచి కాటూరి రంగారావు, రసూల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణదారులకు అవగాహన

ముండ్లమూరు : ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లోకిరాణా షాపుల యజమానులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దర్శి సిఐ రామకోటయ్య మాట్లాడుతూ ప్రస్తుతం దొంగల బెడద ఎక్కువగా ఉన్నందున దుకాణ దారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి దుకాణం వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంపతకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

5న సిఐటియు మండల మహాసభలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిఐటియు మండల 5వ మహాసభలు ఈ నెల 5న స్థానిక వడ్డెపాలెం పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు మండల కార్యదర్శి ఎస్.తిరుపతిరెడ్డి తెలిపారు. సిఐటియు మండల నాయకులు, కార్యకర్తలు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఐటియు జెండా ఆవిష్కరణ

సిఐటియు 5వ మండల మహాసభలను జయప్రదం చేయాలని మండలంలోని ఉప్పలపాడులో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు బక్కా ఏసురత్నం, దేవదానం, శ్రీను, మున్నయ్య, యాకోబు, ఆనందం, యోహాను, నాగూర్‌బాషా, కెవిపిఎస్ రత్నం పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-టంగుటూరు



స్థల పరిశీలనలో అశోక్‌బాబు, అధికారులు

టంగుటూరు పంచాయతీ పరిధిలోని రావివారిపాలెం గ్రామ వాసుల తాగునీటి కష్టాలకు ఎట్టకేలకు పరిష్కారం లభించనుంది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ట్యాంకు నిర్మాణానికి నాయకులు చొరవ చూపారు. వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో ట్యాంకు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. గ్రామ సర్వే నెంబర్ 1038లో 3 సెంట్లు స్థలం అవసరమని గుర్తించారు. అక్కడ 40వేల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి జలజీవన్ మిషన్ పథకం నుంచి రూ.30 లక్షల నిధులు మంజూరుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపారు. టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఒప్పందానికి మరో 3 నెలల సమయం పడుతుందని, అనంతరం మరో 6 నెలల సమయంలోగా ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు తాగునీరు అందించేలా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రామంలో సైడు కాలువల నిర్మాణానికి మరో రూ.5 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని వరికూటి అశోక్ బాబు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ నరసింహారావు, ఎఇ సుబ్బారావు, ఐఆర్‌డి నర్రా జగదీష్ బాబు, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైసిపి నాయకుడు బీరీడి ఉదయకుమార్, మక్కెన వెంకయ్య, నంబూరి అశోక్, బత్తుల ఆనంద్, వెంకటేశ్వర్లు, మాధవరావు, సవలం మహేష్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
శుక్రవారం 3 ఫిబ్రవరి 2023

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఎదగాలి

ప్రజాశక్తి-పంగులూరు

విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. గురువారం సాయంత్రం పంగులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వలన అనేక మంది విద్యార్థులు తప్పు దోవ పట్టి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తున్నారని అన్నారు. మాదక ద్రవ్యాల వలన ఆరోగ్యాలు కూడా చెడిపోయి సర్వనాశనమయిపోతున్నారని, సమాజానికి కూడా ఎంతో నష్టమని అన్నారు. వాటికి దూరంగా ఉండటం వలన మంచి జీవితాలను పొందవచ్చని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చక్కగా చదువుకొని మంచి ఉద్యోగాలను పొంది జీవితాలను ఆనందమయం చేసుకోవచ్చని ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ దశలోనే విద్యార్థులు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరం: స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వలన కలుగే అనర్థాలను వివరించారు. ప్రభుత్వం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఉన్నత భవిష్యత్తు కొరకు కష్టపడి చదువుకోవాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సురేష్‌బాబు అమ్రేష్‌రెడ్డి, పిఈటి సాంబమూర్తి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



నగరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అవార్డు పొందిన ఆనందంలో కళాశాల సిబ్బంది

'సెయింట్ ఆన్స్'కు ఐఎస్ఎఫ్ అవార్డు

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ బెస్ట్ ఐఎస్ఎఫ్ అవార్డు పొందినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఐఇటిఇ డే సెలబ్రేషన్స్ (టెక్ క్రాంతి-2023) కళాశాలలోని ఇసిఇ విభాగం వారి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మొయిద వేణుగోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఐఇటిఇ విజయవాడ సెంటర్ ఛైర్మన్ డాక్టర్ బి రాజశేఖర్, డాక్టర్ బి సూర్య ప్రసాద రావు ముఖ్య అతిథులుగా హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఇటి స్టూడెండ్ చాప్టర్‌లో ఎక్కువ మంది విద్యార్థులు మెంబర్షిప్‌ను తీసుకోవాలని ఆకాంక్షించారు. తద్వారా విద్యార్థులకు అవసరమైన వివిధ కార్యక్రమాలను నిర్వహించవచ్చని తెలిపారు. విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంపొందించి నూతన ఆవిష్కరణలను రూపొందించడానికి ఆస్కారమవుతుందని తెలిపారు. ఈ యేడాది మూడో సంవత్సరం విద్యార్థులు 137 మంది, ఫ్యాకల్టీ 11 మంది మెంబర్ షిప్‌ను తీసుకోవడానికి కృషి చేసిన కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ డివిఎస్ సుకన్యకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇసిఇ విభాగాధిపతి కె జగదీష్ బాబు మాట్లాడుతూ కళాశాల గత 13 సంవత్సరాల నుంచి ఐఇటి స్టూడెండ్ చాప్టర్ వారి ఆధ్వర్యంలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఇటి స్టూడెండ్ చాప్టర్ ద్వారా ఇసిఇ విభాగ విద్యార్థులు తమ విజ్ఞానాన్ని, సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకోవడానికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఇంటర్ కాలేజ్ కాంపిటీషన్లలో విద్యార్థులు పాల్గొనటం ద్వారా విద్యార్థులకు టీం వర్క్, నెట్ వర్క్ బిల్డింగ్ వంటి వాటిలో అవగాహన పెంపొందించుకోవచ్చునని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి: ఎంపిడిఒ

ప్రజాశక్తి-పంగులూరు

జగనన్న లేఔట్లలో ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, ఎంపీడీవో ఎంవి రమణమూర్తి కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కొండమంజులూరు గ్రామ చేరుకున్న ఎంపీడీవో రమణమూర్తి, గ్రామంలోని జగనన్న కాలనీ పరిశీలించారు. ఇంకా అక్కడ కొంత మంది ఇళ్లు మొదలుపెట్టని వారితో మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఉంటే డిఆర్‌డిఎ ద్వారా 35 వేల రూపాయలు బ్యాంకు రుణం కూడా ఇప్పిస్తున్నామని, అందువలన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గ్రామ సచివాలయంలో తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ ఒకటి, మూడు కేంద్రాలను సందర్శించారు. హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, మెనూను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో ఎలిమెంటరీ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలతో మాట్లాడారు.



కొండమంజూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రమణమూర్తి

రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం వెల్నెస్ సెంటర్‌ను సందర్శించారు. 104 సేవల వివరాలను తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే వెరిఫికేషన్‌లో భాగంగా వాలంటీర్లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే గొట్టిపాటి

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని పలు గ్రామాల్లో, పలువురు వ్యక్తులను అద్దంకి శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్ గురువారం నాడు కలిసి పరామర్శించారు. ముందుగా మండలంలోని జనకవరం గ్రామానికి చెందిన పుల్లెల ఆదిశేఖర్ ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వెళ్లి తేనేటి విందులో పాల్గొన్నారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన రాయిని సుధీర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి, కాలికి శస్త్ర చికిత్స చేయించుకోగా వారి నివాసానికి వెళ్లి సుధీర్‌ను పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న గుర్రం శకుంతలను పరామర్శించి ఆరోగ్య విషయం గురించి వాకబు చేశారు. పంగులూరు గ్రామంలో ఫణితపు చెంచు రామారావు కుమార్తె వివాహాన్ని పురస్కరించుకొని, హాజరై నూతన వధువు దివ్యకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు. పంగులూరు గ్రామానికి చెందిన బాచిన నాగేశ్వరరావు బుధవారం నాడు మరణించగా ఆయన నివాసానికి వెళ్లి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, మాజీ జడ్పిటిసి కరి వెంకట సుబ్బారావు, పార్టీ మండల నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, తలపనేని రాంబాబు, గుర్రం ఆదిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

పిడిపిఎఫ్ రుణ సేవలు వినియోగించుకోండి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా పర్మినెంట్ ఫండ్ నిధి లిమిటెడ్ (పిడిపిఎఫ్) అందిస్తున్న రుణ సేవలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని సంస్థ ఛైర్మన్ పోతినేని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక కోర్టు సెంటర్ పాత ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఛైర్మన్ పోతినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు చేసిన సంవత్సర కాలంలో 15 కోట్ల డిపాజిట్లు సేకరించామని, రుణాలు ఇచ్చామని పేర్కొన్నారు. పిడిపిఎఫ్ డిపాజిటర్లు, సభ్యుల శ్రేయస్సు, సంక్షేమం, సామాజిక అభ్యుదయం తదితర ఉన్నత లక్ష్యాలతో పనిచేస్తుందని అన్నారు. రికరింగ్ డిపాజిట్లపై 9 శాతం వార్షిక వడ్డీ ఇస్తున్న ఏకైక సంస్థ అని తెలిపారు. సేవింగ్ ఖాతాలపై నెలవారీ వడ్డీ 7.5 శాతం ఇస్తుందన్నారు. బంగారు రుణాలపై ఎలాంటి అపరాధ వడ్డీ వసూలు చేయమని, గ్రాముకు రూ.4 వేల రుణం సులభ వడ్డీతో జారీ చేస్తున్నామని అన్నారు. మధ్యతరగతి, దిగువ తరగతి కలల సాకారానికి బంగారు నగల కొనుగోలు కోసం వాయిదా పద్ధతిపై రుణాలు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. సులభ వడ్డీపై తాకట్టు రుణాలు మంజూరు చేస్తామన్నారు. సంస్థ డైరెక్టర్ కారుమంచి సుబ్బారావు మాట్లాడుతూ సంవత్సర కాలంలో 15 కోట్ల డిపాజిట్లతో పాటు బంగారు రుణాలు, మార్టిగేజ్ రుణాలు, వాహన రుణాలు, గృహ రుణాలు అందజేశామని పేర్కొన్నారు. సంస్థ పట్ల ఖాతాదారులు పూర్తి నమ్మకంతో ఉన్నారని అన్నారు. రికరింగ్ డిపాజిట్లు సంవత్సరం, 2, 3, ఐదు సంవత్సరాల కాలపరిమితిపై 9 శాతం వడ్డీ ఇస్తున్నామని అన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో బ్యాంక్ మేనేజర్ టి శ్రీనివాస్, డైరెక్టర్లు, పిడిపిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిపిఎఫ్ సభ్యులు

తిరుమలకు మార్టూరు కూరగాయలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజూ జరిగే అన్నదానానికి అవసరమయ్యే కూరగాయలను అందజేయడానికి మార్టూరు భక్తులు మూడు నెలల క్రితం అనుమతి కోరారు. దీనికి దేవస్థానం నుంచి ఫిబ్రవరి 5వ తేదీన మార్టూరు నుంచి కూరగాయలు పంపాలని సందేశం పంపారు. దీని కోసం స్వామివారి ప్రత్యేక వాహనం 5న ఉదయం మార్టూరు చేరుకుంటుంది. 5న ఉదయం 9 గంటలకు స్వామి వారి వాహనం కూరగాయల లోడుతో మార్టూరులోని ప్రధాన సెంటర్లోని పెదకానా వద్దకు చేరుకుంటుంది. దీన్ని మార్టూరులో ఒక ఆధ్యాత్మిక సంబరంగా నిర్వహిస్తామని, స్వామివారి వాహనం వద్ద వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి లడ్డూ ప్రసాదం అందజేస్తామని తెలిపారు.

పర్చూరు ఎస్ఐగా చెంచు ప్రసాద్

ప్రజాశక్తి-పర్చూరు



పర్చూరు ఎస్ఐగా చెంచు ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నేరాలను అదుపు చేయటంలో ప్రజలు సహకరించాలని కోరారు.



బాధిత కుటుంబానికి సరుకులు అందిస్తున్న దాతలు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు చెంచుల కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద కుటుంబానికి రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సరుకులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కోట ప్రసన్న, కోట శ్రీనివాసరావు, క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, మాజీ ఎంపిపి కోట హరిప్రసాద్, కొల్లా సుబ్బారావు, భవనం రాజగోపాల్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో అధికారుల విచారణ

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరులోని గిరిజన పాఠశాలలో లైంగిక వేధింపులు, మత్తు పదార్థాల వాడకం వంటి విషయాలపై ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉప కార్యదర్శి ఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పర్చూరులోని గిరిజన పాఠశాలపై వస్తున్న నిందారోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ ఖాదర్‌వలి, ఇతర సిబ్బంది నుంచి వేర్వేరుగా లిఖిత పూర్వకంగా వివరాలు తీసుకున్నారు. వ్యాయామోపాధ్యాయుడు లైంగికంగా విద్యార్థులను వేధిస్తున్నాడన్న ఆరోపణలపై వివరాలు అడిగారు. ఉప కార్యదర్శి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచి విచారణ స్వయంగా తీసుకున్నామన్నారు. ఆయన వెంట శ్యాంసుందర్, దయాసాగర్ పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిధిలోని మూడు మండలాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకోవలసినదిగా సిడిపిఒ జి సుభద్ర తెలిపారు. ఆయాల పోస్టులకు 7వ తరగతి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పర్చూరు మండలంలో పోస్టులు 6, కారంచేడు మండలంలో 2, ఇంకొల్లు మండలంలో 4 ఖాళీగా ఉన్నాయని సిడిపిఒ వివరించారు.

ఢిల్లీ వెళ్లిన కలెక్టర్ దినేష్‌కుమార్

'కాఫీ విత్ కలెక్టర్'పై ప్రజెంటేషన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ ఢిల్లీ వెళ్లారు. 'వినూత్న కార్యక్రమాల అమలు' కేటగిరీలో ప్రధానమంత్రి అవార్డుకు సంబం ధించి కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు కోరగా.. ప్రకాశం జిల్లాలో విద్యార్థులకు భవిష్యత్తుపై అవగాహన కల్పించేలా ప్రత్యేకంగా నిర్వహి స్తున్న 'కాఫీ విత్ కలెక్టర్', 'కెరీర్ గైడెన్స్ క్లాసు' లకు సంబంధించిన వివరాలను 'మార్గదర్శిని' పేరుతో జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు సమర్పించారు. ఈ నేపథ్యంలో 'మార్గదర్శిని' ప్రోగ్రాంకి సంబంధించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వవలసిందిగా ఢిల్లీ నుంచి ఆహ్వానం రావడంతో కలెక్టర్ ఢిల్లీ వెళ్లారు. విద్యార్థులు వ్యక్తిగతంగా, ఉద్యోగపరంగా ఉన్నత స్థానాలకు ఎదిగేలా తాను ప్రత్యేక చొరవతో చేపడుతున్న కార్యక్రమాలను సెలక్షన్ కమిటీ సభ్యులకు కలెక్టర్ గురువారం వివరించారు.



ఢిల్లీలో కలెక్టర్ దినేష్‌కుమార్

గ్రామీణ పేదలను విస్మరించిన బడ్జెట్

- రైతు, కౌలు రైతు సంఘాల నేతల విమర్శ
- బడ్జెట్ పత్రాలు చించివేసి.. నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశానికి పట్టుకొమ్మలుగా ఉన్న గ్రామీణ ప్రాంతాలను, వ్యవసాయ రంగాన్ని, గ్రామీణ పేదలను పూర్తిగా నిర్లక్ష్యం చేసే విధంగా ఉందని రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు మండి పడ్డారు. స్థానిక ఎల్‌బిజి భవన్ సెంటర్‌లో గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ పత్రాలను చించివేసి.. నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు పమిడి వెంకటరావు, కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ 65 శాతానికి పైగా ప్రజలు జీవిస్తున్న గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టే విధంగా కేంద్ర బడ్జెట్ ఉందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి గత సంవత్సరం రూ.1,51,521 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం రూ.1,44,224 కోట్లకు కుదించారని, ఎరువులపై సబ్సిడీని గత సంవత్సరం 2,25,250 కోట్లు ఉండగా ఈ సంవత్సరం 1,75,100 కోట్లకు కుదించారన్నారు. 2022 నాటికి రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో నుండి బయటకు తెస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని, ఈ రంగంపై ఆధారపడిన ప్రజలను మరింత సంక్షోభంలోకి నెట్టే చర్యలు చేపట్టిందని విమర్శించారు. దేశ నడిబొడ్డున ఏడాది పాటు రైతన్నలు నిర్వహించిన మహత్తర పోరాట ఫలితంగా మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకుంటామని ప్రకటించిందన్నారు. ఆ సందర్భంలో కనీస మద్దతు ధర చట్టానికి రూపకల్పన చేస్తామని చెప్పిన మాటలు విస్మరించి కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందన్నారు. కోవిడ్ నుండి ప్రజలు కోలుకోలేదని, పట్టణ ప్రాంతాలకు వలస వచ్చిన ప్రజలు పనుల కోసం సుదూర ప్రాంతాలకు వలసలు పోతూనే ఉన్నారని తెలిపారు. వలసల నివారణ కోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాలకు కూడా విస్తరించి కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు నిర్ణయించాలన్నారు. రూ.రెండు లక్షలా అరవై వేల కోట్లు కేటాయించాలని కోరుతుండగా కేవలం 60 వేల కోట్లతో సరిపెడుతున్నారంటే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. బడ్జెట్‌పై జరిగే చర్చలో గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ రంగం, ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచే విధంగా ప్రభుత్వం ఆలోచించాలని, లేకపోతే మరో ఉద్యమానికి కార్మిక, కర్షక, కష్టజీవులు సమాయత్తమవుతున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పెంట్యాల హనుమంతరావు, యస్‌కె.మాబు, సూదనగుంట నరసింహారావు, నెరుసుల వెంకటేశ్వర్లు, లక్కు తిరుపతయ్య, జి రవికుమార్, పి కిరణ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి రఘురామ్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

విద్యుత్ వినియోగదారుల

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

ఎపిసిపిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జె.పద్మనాభరెడ్డి

ప్రజాశక్తి-దరిశి

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎపిసిపిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జె.పద్మనాభరెడ్డి అన్నారు. గురువారం పిజిఎన్ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలో ఇఇ షేక్ అబ్దుల్ కరీమ్ అధ్యక్షతన విద్యుత్ వినియోగదారుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఇటువంటి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 20 అర్జీలు రాగా 19 అర్జీలు అక్కడికక్కడే పరిష్కరించారు. ముండ్లమూరు మండలంలో సబ్‌స్టేషన్ కావాలని అర్జీ రాగా వీలైన త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పొదిలిరోడ్‌లో గల సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించి ఎటువంటి ఆక్రమణలకు గురికాకుండా చూడాలని డివిజనల్ ఆఫీసును మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం విద్యుత్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ నిరంతరం విద్యుత్ ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఇ సత్యనారాయణ, డిఇ పిచ్చయ్య, ఎస్‌ఎఒ సుబ్బారావు, ఎఇలు సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు తీసుకుంటున్న జె.పద్మనాభరెడ్డి

ఉచితంగా వైద్య సేవలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ప్రతి నెల మొదటి గురువారం జరిగే ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు జరిగిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 140 మంది రోగులు వైద్యాన్ని పొందారు. కార్యక్రమంలో వైద్యులు చాపల వంశీకష్ణ, చాపల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సుజాత

ప్లాస్టిక్ నివారణపై

ప్రజల్లో అవగాహన కల్పించాలి: మేయర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో ప్లాస్టిక్ నివారణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని నగర మేయర్ గంగాడ సుజాత కోరారు. మెప్మా రిసోర్సు పర్సన్‌లతో గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. సమావేశంలో మేయర్ మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపడుతున్నామని, అందరూ చెత్తను ఆటోలకు ఇచ్చే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూజర్ ఛార్జీల వసూళ్లకు సచివాలయ సిబ్బందికి మెప్మా రిసోర్సు పర్సన్లు సహకరించాలని కోరారు. టిడ్కో ఇళ్లకు బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా సమన్వయం చేయాలని కోరారు. ఒంగోలు నగరాన్ని ప్లాస్టిక్ వ్యర్థ రహిత నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఒంగోలుకు మొదటి పది ర్యాంకుల్లో స్థానం పొందేలా అందరూ కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవికుమార్, కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ బ్రహ్మయ్య, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కొండయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో అంతా మోసమే..

రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

టీడీపీ అధినేత చంద్రబాబు పాలనంతా అవినీతి, మోసం, అబద్ధాలతో సాగిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. పెద్దదోర్నాలలోని ఒకటో సచివాలయం పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరించారు. దీంతో ప్రజలు మంత్రి సురేష్‌పై పూలవర్షం కురిపించి.. బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ గ్రామస్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందించి పేదల గుండెల్లో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. నవరత్నాల ద్వారా పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. 2014 ఎన్నికల్లో హామీలను గుప్పించి అధికారం చేపట్టిన వెంటనే ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ తాను అధికారంలోకొస్తే ప్రజలకు మరింత మేలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో మంచి పరిపాలన సాగుతున్నప్పటికీ చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్, ఎల్లోమీడియా అసత్యాలను ప్రచారం చేస్తూ రాజకీయలబ్ధి పొందాలని యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అంతా తెలుసునని.. వారు ఎన్ని డ్రామాలు, నాటకాలాడినా మోసపోరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ గంటా వెంకటేశ్వరరెడ్డి, అమిరెడ్డి రామిరెడ్డి, షేక్ మజీద్, సర్పంచ్ చిత్తూరి హారిక, ఉప సర్పంచ్ రసూల్, నాయకులు జోగి వెంకట నారాయణ,పవన్‌తో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.



హైవే అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

హైవే పనులు పటిష్టం: మంత్రి

పెద్దారవీడు మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంట నుంచి దోర్నాల వరకు 25 కి.మీ.లు హైవే రోడ్డు నిర్మించడానికి రూ.240 కోట్లు మంజూరైనట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. గురువారం ఆయన పెద్ద దోర్నాలలో నేషనల్ హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పనులు వేగవంతంగా, నాణ్యతగా, పటిష్టంగా నిర్వహించాలని చెప్పారు. ఫెన్సింగ్, డ్రైనేజీ, సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని తెలిపారు. పనులలో రాజీ పడకుండా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ పార్కుల ఏర్పాటుపై ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంజూరు చేసిన సోలార్ పార్కులు, వాటి ఉత్పత్తి సామర్థ్యం, నిర్మాణంపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర విద్యుత్, కొత్త పునరుత్పాదక శక్తి శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ సమాధానమిస్తూ 'డెవలప్‌మెంట్ అఫ్ సోలార్ పార్క్స్' పథకంలో 4,100 మెగా వాట్ల సామర్థ్యం ఉన్న 5 సోలార్ పార్కులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంజూరయ్యాయన్నారు. 1,400 మెగా వాట్ల సామర్థ్యం గల పార్కు అనంతపురంలో, 1,000 మెగా వాట్ల సామర్థ్యం ఉన్న పార్కులు కర్నూలు కడపలోను, 500 మెగా వాట్ల సామర్థ్యం గల పార్కు అనంతపురంలోను, 200 మెగా వాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ విండ్ హైబ్రీడ్ పార్క్ ఆమోదించబడ్డాయన్నారు. అనంతపురం, కర్నూలులోని సోలార్ ప్లాంట్లు మొత్తం 2,400 మెగా వాట్ల సామర్థ్యంతో నిర్మించబడ్డాయన్నారు. కడప పార్కు 250 మెగావాట్లు, అనంతపురం పార్కు 400 మెగా వాట్ల సామర్థ్యంతో నిర్మించబడ్డాయన్నారు. ఈ పథకం 2024 మార్చి నెల వరకు పొడిగించబడిందని కేంద్రమంత్రి తెలియజేశారు.